# విడిపోయిన మబ్బులు

శ్రీ సత్యనాథ్

ప్రొద్దుట నుంచీ, ఒకటే వానగా ఉంది. వాతావరణం చీదరగా ఉంది. బైటకు నడుద్దామంటే యింకా వర్షం తగ్గలేదు. బాబిగాడు బాబయ్య "తడుస్తావురా" అన్నా వినిపించుకోకుండా వీధిలో పడవలు కట్టి, ఆడుతున్నాడు. ఈవేళ ప్రొద్దున నుంచి 48 గంటలు గాలివానని రేడియో వార్తతో మా బాబయ్యకంగారు వేరేచెప్పక్కర్లేదు. ఎప్పుడో పెట్టిన మా వరండా గోడ యీవానలకీ పడిపోయింది.

"ఒరే రాముడూ ! పేపరువచ్చిందేమోచూడరా" అంటూ పిలిచారు. నేనప్పుడు మా అక్కయ్యకూతురు అమ్మాజీతో ముద్దులాడుతున్నా. నేనంటే అమ్మాజీకీ మంచి చనువు. అక్కయ్య యింటికి వెళ్ళినట్లైతే, అమ్మాజీ నన్నువదిలేవి కాదు.

మళ్లీ బాబయ్య పిలిచేటప్పటికి ఉలిక్కి పడ్డా ప్రక్కంటి విశ్వేశ్వరరావు గారింటికి వెళ్ళి పేపరు మాట అడిగితే "మూడు రోజులనుంచి పేపరు ముఖం ఎరుగనన్నాడాయన

అమాయికమైన అమ్మాజి హృదయం నన్ను ఆకర్షించింది. కల్మషంలేని ఆ చిరుపాప హృదయ పంజరంలో నాకు శాశ్వత స్థానం వుంటుందని అనుకునేవాణ్ణి. నాకు ధర్మ పత్నిగా, అమ్మాజీ కనుక అయినట్లైతే, ఆమె లోకంలో గృహలక్ష్మిగా వెలుస్తుంది.

మౌనంగా ఉండడమంటే అమ్మాజీకి యిష్టం ఉండదు. ఏదో విషయం గురించి ఒక్కలా వాగుతూ వుంటుంది. మాలో ఎవరైనా మాట్లాడించకుండా ఉంటే, అదే మాట్లాడ్డానికి పూనుకుంటుంది. అమ్మాజిగురించి మాటలువస్తే యిదే చెబుతుంది అక్కకూడా. కాని దాని మాటలు మాకెవరికి విసుగు పుట్టించవు. మధురంగా పలికే ఆ చిలుక పలుకులు, యింకావినాలనే ఉంటుంది. పవిత్రమైన, ప్రేమతో కనుక చూస్తే విషంకూడా అమృతంగా మార్చవచ్చును.

"మనఊరు ఎప్పుడు మునుగుతుందో చెప్పు" అంటూ అమ్మాజీ నా ముఖంకేసి అమాయికంగా చూసింది.

"ఎందుకు" అన్నా.

"మరేమోనే, ఊరంతా నీటితోనిండితే, ఆనీటిలో పడవలు కట్టుకొని ప్రయాణం చేయవచ్చు"నిఅంది నవ్వుతూ.

భాధ్యతలవల్ల కొంచెము దెబ్బతిన్న నేను అమ్మాజీ ప్రశ్నకు సమాధానం చెప్పలేక పోయా.

"కోపం వచ్చిందా?"

"ఎందుకు నీపై నాకు కోపం" అన్నా

"అయితే ఎందుకు నేనడిగినదానికి సమాధానం చెప్పవు!-చెప్పు"

ఇంతట్లోకే మా అక్కయ్య మేమున్నచోటికి వచ్చింది. మేమన్నమాటలు వినే ఉంటుంది. వాళ్ళమ్మను చూచి అమ్మాజి చటుక్కున లేచి వెళ్ళిపోయింది.

"అమ్మాజీ బాగా సాగదీస్తోందా నిన్ను" అని అడిగింది అక్క.

నేను మాట్లాడలేదు.

"అమ్మాజీకి నువ్వంటే మంచి ప్రేమరా. ఎప్పుడూ మీ బావతో నీ గురించే చెబుతుంది" అంటూ పురాణం విప్పింది.

"అమ్మాజీ అల్లరి ఎలా ఉంది" అని అడిగాను ప్లేటు మారుస్తూ.

"ఎప్పుడూ నిన్నే పెళ్లాడతానని అంటుంది" అంటూ అక్క అక్కడినుంచి వెళ్ళిపోయింది.

నే నిక్కడే అమ్మాజీ చిలిపి చేష్టలు తలుచుకుంటూ ఉండిపోయాను. నా ఆలోచనా తీవ్రత ఎంతో సేపటివరకు లేదు. ఎక్కడినుంచో వచ్చిపడిన గులాబి పువ్వు నా మనస్సును మళ్ళించింది.

♦ ♦ ♦

సావిట్లో కూర్చున్న బాబయ్య. అగ్గిపెట్టె తెమ్మని పిలిచారు. పిన్ని నడిగి అగ్గిపెట్టె బాబయ్య చేతికిచ్చి నిలబడ్డా.

"ఎప్పుడు తెరుస్తారు నీ స్కూలు" అన్నారు బాబయ్య.

"ఇక వారం రోజుల్లో."

"శలవల్లో మట్టుకుని ఒక గంటేనా చదివిన పాపాన్నిపోలేదు; ఎప్పుడు చూచినా అమ్మాజీతోనే ఆటలు" అంటూ కూతలేశాడు.

ఆ వేళనుంచి అమ్మాజీతో సరదాగా ఉండడము కొంతవరకు తగ్గించా. ఇంతట్లోనే మా స్కూలు తెరవడం జరిగింది.

♦ ♦ ♦

ఆ వేళ భోగిపండుగ. పండుక్కి బాబయ్యఅక్కను బావను మా యింటికి రమ్మనమని వ్రాశాడు. కాని వాళ్లు యింతవరకు రాలేదు. అక్కను చూడాలని ఉండడం కన్న అమ్మాజీని చూడాలని కళ్లుకాయలు కాశాయి. ఇప్పుడు అమ్మాజీ ఎలా వుంటుందో అనుకునేసరికి అమ్మాజీ నా స్మృతిపథంలో, సన్నగా పొడుగ్గా తన నల్లటి ముంగురులు చంద్రబింబమువలె మెరిసే ఆ ముఖానికి విరిశోభ యిస్తుంటే భూలోక సుందరిలా వచ్చి నిలబడింది. యవ్వమనే పూల తోటలో చేతితో తాకిన కందునేమోనని భ్రాంతి కలిగించు లతమాలికవలె వయ్యారంగా ఉంటాయి ఆమె నడకలు. ఆ గులాబి రంగు జార్జెట్ చీరతో సిరకుమమును తెలగు చూడ్డానికి యింపుగా ఉంటుంది.

ఇంతట్లోనే బండివచ్చాడు.

బాబయ్య, "అమ్మాయి వచ్చిందర్రా" అంటూ గట్టిగా అరిచాడు.

పిన్ని పళ్ళెంలో యిన్ని అక్షితలు హారతి వేసుకుని చక్కావచ్చింది అక్కకు దిష్టి తీద్దామని.

అంతా లోపలకు చక్కావచ్చారు. బాబయ్య "నువ్వు ఒక్కతివే వచ్చావా" అని ప్రశ్నించారు.

"ఊ" అంది అక్క.

ఇదంతా వింటున్న నాకు అగమ్యగోచరంగా ఉంది. వచ్చి గదిలో యీజీ చైర్‌లో కూర్చున్నా. అమ్మాజీ జ్ఞాపకం వచ్చింది. లేచివెళ్ళి అక్కను అడిగా అమ్మాజీ రాలేదెందుకని.

"అదే రానందిరా" అంది అక్క.

ఎందుకు రానంది అమ్మాజీ? చిరునగవుల వర్షం కురిపించిన అమ్మాజీ నోటివెంట "రానని" పిడుగు లాంటి అపస్వరమా.

నోరు విప్పితే ప్రేమసాగర అలలు పుట్టించే అమ్మాజీకి యీనాడు మామయ్యను చూడాలనిపించ లేదా? మెరసే ఆ చిలిపి చేష్టలతో, విరిసే ఆ నవ యవ్వన వెన్నెలలో మురిపించే ఆ కోమలి మధుర కంఠం మరవాలన్నా మరపురావడములేదు. ఎందుకు రానందో కారణం తెలిపితే యింత బాధలేకుండా ఉండేది.

"ఎందుకు రానంది" అమ్మాజీ అని మళ్ళా ప్రశ్నించా అక్కను.

"నీకు కష్టంగానే ఉండొచ్చు, అమ్మాజీ లేక పోబట్టి. కాని అమ్మాజీ యిప్పుడు నీచేతుల్లో నలిగిన చిరుపాపకాదు. అమ్మాజీ యిప్పుడు పెద్దదైంది.మళ్ళీ

నాన్నగారికి కూడా అది యిక్కడకు రావడమంటే యిష్టంలేదు."

"అవుతే అతని ఉద్దేశ్యం"

తరువాత చెప్తానంటూ, పిన్ని పిలిస్తే అక్క వెళ్ళిపోయింది.

అమ్మాజీకి యిప్పుడు పదునైదవ ఏడు. ఏదో చదవను చదువుతోంది. నాకప్పుడే ఉద్యోగమయి, పద్దెనిమిదవ ఏడు.

ఆఫీసులో కూడా అమ్మాజీ యే జ్ఞాపకంవస్తోంది. ప్రతి కాగితంలోను అమ్మాజీ యొక్క ప్రతిబింబమే కనబడుతోంది. మరుద్దామన్నా మరవలేకుండా ఉన్నా. నిద్దట్లో అమ్మాజీతో మాట్లాడుతున్నట్లు కల్ల. నే నెవరికోసం బ్రతుకుతున్నది! అమ్మాజీ ప్రక్కను లేని జీవితము ఒక జీవితమా. ఆమె లేందే బ్రతికేకన్న చనిపోతే మేలనిపించేది. కాని, ఒకవేళ బలవంతంగా చనిపోతే ఆ కళంకము అమ్మాజీ సుఖ జీవితాన్ని పాడుచేయవచ్చు. అందుకు దానికి యిష్టం ఉండడము లేదు. ఏ జ్యోతినైతే, ఆరిపోకుండా మూచుకుంటున్నానో, ఆ జ్యోతే నాకు నా కళ్లకు అంధకారమైంది. ఏ చిలుకకైతే మాటలు, పాటలు నేర్పుతూ ఒక మధురగాయకిమణిగా మార్చానో, ఆ చిలుకే యిప్పుడు నా హృదయపంజరము దాటిపోవ జూస్తోంది.

ప్రేమనే వస్తువు లభ్యం అవదు. ఒకవేళ భాగ్యవశాన పట్టుపడితే మనల్ని వదలని విషయమది. ప్రేమనొక కళగా ఆరాధించినవాళ్ళు సుఖంగా బ్రతుకుతెరువుగా, పూజించేవారికి కూడ ఏ లోటు ఉండదు. కాని జీవిత లక్ష్యముగ ప్రేమకు స్థానం యిచ్చినచో ఆశాభంగము కలక్క మానదనే దృఢ నిశ్చయానికి వచ్చా.

ప్యూన్ తలుపు త్రోసుకుని లోపలికి వచ్చి ఎదురుగా నిలబడ్డాడు. నా దీర్ఘాలోచనను పాడు చెయ్యడం వాడికి కూడా యిష్టం లేకపోవచ్చును.

"సార్" అంటూ, యిది మూడవసారండి పిలవడం" అన్నాడు.

"ఏం" అని తలఎత్తా.

మేనేజరుగారు తమర్ని ఒకసారి రమన్నారండి.

"వట్టి నేనా" అన్నా ప్యూన్‌తో.

"ఆయన ఏమి కోపంగా కనపడటం లేదండీ"

మేనేజరు వట్టినే పిలువడు. అతను పిలిచేడంటే, ఏదో అంతరార్థం ఉండకపోదు. నే నేదైనా తప్పు రాసి ఉండాలి అని ఊహించుకుని, కుర్చీకి తగిలించిన కోటు తొడుక్కుని మేనేజరుగారి రూము వైపు నడిచా.

"నీతో ఎన్నో రోజులనుంచి ఒకమాట అడుగుదామనుకుంటున్నా" అంటూ నా వైపు తిరిగారు మేనేజరు.

భయ, విభ్రాంతులతో ఆయన ఎదుట నిలబడి "చెప్పండి" అన్నా.

"నువ్వు యింకా పెళ్లి చేసుకో లేదుట ఎందుచేత?"

"అది నా స్వంత నిర్ణయం, మీతో చెప్పడం అనవసరమని నా ఊహ" అన్నా.

"నువ్వు చెప్పక పోయినా, నీ సత్ప్రవర్తన నన్ను అడిగేటట్లు చేసింది. మా అన్నగారమ్మాయి ఉందిలే పెళ్ళికి, విద్యావంతురాలు" అంటూ ఆగారు మేనేజరు.

"నా పెళ్ళిలో మీరేమీ కలగచేసుకోవద్దని నా ప్రార్థన" అంటూ బైటకు వచ్చేశా.

మర్నాడు ఆదివారం మూలాన్ని యింటి దగ్గరనే ఉన్నా. బాబయ్య పిన్ని నన్ననేక విధాల బ్రతిమాలారు నా మనస్సు మార్చుకోమని. వాళ్ళకు నేనిచ్చే సమాధానం మౌనం.

"నువ్వు చదివిన చదువు తక్కువట. తెచ్చుకునే జీతము ఏమూలా చాలదట. చిన్నప్పటినుంచి, మనం గతిలేక నే అతన్ని ప్రేమించామని తలుస్తున్నాడు నీ బావ. మన పవిత్రాదర్శాలను అర్థంచేసుకోని

వ్యక్తులతో సంబంధము మంచిదిగాదని" పిన్ని ఎన్నో విధాలు చెప్పింది.

"అమ్మాజీని మరవలేను" పిన్నీ.

"నీ బావను మనం తక్కువ సంస్కారముగల వారముగా కనిపిస్తున్నాము. ఎప్పుడో వచ్చినప్పుడు ఏదో విషయం గురించి చెప్పుతాడు. "మీకు సుభ్రత లేదని" యేవెయ్యిసార్లో అని ఉంటాడు. కూతురుకు, ఎల్లాంటి సంబంధం తెస్తాడో చూస్తాముగా" అంటూ కళ్ళవెంట నీళ్లు పెట్టుకుంది పిన్ని.

పిన్నినిచూచి నాకూ ఏడుపువచ్చింది.

"అయితే మేము చెప్పింది వినవన్నమాట" అంది పిన్ని కోపంగా.

"క్షమించు పిన్నీ, యీ విషయంలోతప్ప మరే విషయమైనా వప్పుకు తీరతా."

"నీ యిష్టం" అంది పెద్ద నిట్టూర్పుతో.

ఇంతట్లోకి పోస్టుమేన్ ఉత్తరం యిచ్చి వెళ్లాడు బాబయ్య ఉత్తరం చదివారు. అమ్మాజీ పెళ్లి విషయం ఉంటుందని ఆతృతగా వింటున్నా. కాని అది ఆ విషయముపై వ్రాసిన లేఖకాదు. అక్కకు గుండెదడ ఎక్కువగా ఉందట. ఇక్కడకు తెనుగుమందు పుచ్చుకుందుకు వస్తోందట.

అక్కరాగానే దుఃఖము వచ్చింది. ఇప్పుడు ఆమె బాగా చిక్కిపోయింది. డాక్టర్లు ఆమెకు క్షయవ్యాధి సోకిందని చెప్పేరు. అందరికి క్షయవ్యాధి అని విన్న వెంటనే గుండె ఝల్లుమంది. ఆమె యిదివరకు ఎన్నో మందులు వాడింది. ఏమందు పనిచెయ్యడం కనిపించడంలేదు. అక్కకు సేవచేస్తూ ఆఫీసుకు శెలవుపెట్టాను.

ఆమెకు తెలుసు నేను అమ్మాజిని పవిత్రంగా ప్రేమిస్తున్నానని.

"నేను నీకు చేయవలసిన సహాయం చెయ్యలేకపోతున్నందుకు యిప్పటికే కుములుతున్నా"నంటూ కళ్ళనీళ్లు పెట్టుకుంటూఉంది. "మూర్ఖంగా మీ బావ వప్పుకోవటంలేదు. ఆయన నన్ను చేసుకుందుకే అప్పుడప్పుడు విచారిస్తున్నారట. యిక అమ్మాజినికూడా మనయింట్లోపడవేస్తే వేరే చెప్పాలా ఆయన గొడవ. అమ్మాజీకూడా పెళ్ళికి అంత త్వరపడటంలేదు. పెళ్లిమాట ఎత్తితే నేను పెళ్ళిచేసుకోను అంటుంది. ఇంతట్లోకే ఎక్కడినుంచి వచ్చిందో యింటావంటా లేదు యీ పాడు క్షయవ్యాధి."

డాక్టర్లు యిచ్చిన మందు గ్లాసులోపోస్తూ "అమ్మాజీ మావయ్యను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నానంటే చాలు అక్కా"

అక్కకు ఆ రాత్రి దగ్గు ఎక్కువైయింది. రాత్రింపగళ్ళు అక్కకు సేవచేస్తూ ఉద్యోగం వదులుకున్నా. అక్క బ్రతుకుతుందని గట్టిగా నమ్మేవాణ్ణి, రాత్రిళ్ళు ఆమెకాళ్లుపడుతూ నిద్రలేకుండా రోజులు గడుస్తున్నాయి. ఆమె మాట్లాడే నిగూఢపదాలకు అర్థం తెలియక, అలా చూస్తూ ఊరుకొనేవాణ్ణి.

"అమ్మాజీ రేపు వస్తుందనుకుంటూ" అంది అక్క కొద్దిగా లోపల లోపల సంతోషిస్తూ.

మర్నాడు బావ, అమ్మాజీ వచ్చారు. బావ నన్నుచూచీ చూడనట్టు, పలకరించకుండా సావిట్లో కూర్చున్నాడు. అమ్మాజీ అక్క ప్రక్కగా కూర్చుంది. నేను అక్కకాళ్ళుపడుతున్నా.

ఆశ నేపథంలో విహరించడంలేదు ప్రేమ నేపథంలో అశ్రువులు బాయడానికేనా వెనుదీయని ధన్యుల చరిత్ర జ్ఞప్తికి వచ్చింది.

"అమ్మ నీ వంట్లో ఎలా ఉంది" అంది అమ్మాజీ.

ఈ మధ్య వారం రోజులనుంచి ఏమీ బాగుండటం లేదమ్మా. ఒక్కమాట నీకు చెప్పుదామని ఉంది అంటుంటే దగ్గువచ్చి మానేసింది.

నా గురించేమోనని నాకు భయంవేసింది.

"మావయ్యా, ఆ బేసిన్ తీసుకురా అమ్మ అందులో ఉమ్మతుంది" అంది అమ్మాజీ, ఒక్కసారి ఆమె సంపాదించిన నవనాగరికతను చాటుతూ.

ప్రేమలేని హృదయాలు పలికిన పలుకులు, మధురంగా రాగ ఆలాపనతో పలికినా అవి కఠినములే,

మన సంప్రదాయాలు, ఆచారాలను మరచి దూరపు కొండలు నునుపన్నట్లు భావించి పాశ్చాత్య వ్యామోహంలోపడ్డ అమ్మాజీ మాట్లాడే మాటలా యివి. చిన్నప్పటినుంచి స్వార్థంలేకుండా, నీవే లోకమని భావిస్తూ జీవించే వ్యక్తికి మంచి సదుపాయం చేసిపెట్టావు. వ్యక్తులను వాళ్లవాళ్ల ఆర్థికస్థోమతలలో కొలిచి, అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యనే సరిగ్గా ప్రేమించలేని అభాగ్యుని కూతురుగా బాగా నొప్పేవు.

"వ్యక్తులకు విలువివ్వక, వాళ్లప్రస్తుత పరిస్థితులను శాశ్వతమని నమ్ముతూవచ్చిన నీలాంటి వ్యక్తుల కెందరికీ యిప్పటికే ఆశాభంగము కలిగింది. చిన్నప్పటినుంచి ప్రేమించి, మాట్లాడడం నేర్పిన మేము యీనాడు రాణిగారికి, సేవకతుల్యమయ్యాము. ఆడదానికి సహజములైన వందిరీకత, గౌరవము నశిస్తే అది ఆడుదనిపించుకోదు. ఏవో పైపై మెరుగుల వల్ల, వ్యక్తులకు శాశ్వత గౌరవమురాదు," అంటూ బేసిన్ దగ్గరకు తెచ్చా. నేను నువ్వు చెబితే తేలేదు బేసిన్ నా పూజ్యులైన అక్కగారికోరకు అది యిక్కడకు తేబడింది. నీకు మా సంస్కారము రాలేదు, మా ప్రేమ అంటుకోలేదు, మా సహనం నువ్వు ఎరగవు. మా సహనానికి, ప్రేమకు, సంస్కారానికి కదలకుండా పడిఉన్న మీ అమ్మ ప్రతిబింబము, అమ్మాజీ అల్లాగా తలవంచుకుని వింటోంది.

మళ్లీ నేనే చెప్పడం మొదలెట్టా — ఈ నాడు నువ్వు మంచి చీరలు అవి ధరిస్తే, అవి నీకు పవిత్ర స్థానం యివ్వవు. ప్రేమలేని జీవికి, అపరంజి మేడలైనా స్మశానలవలె కనబడతాయి, అంటుంటే బావ గదిలోకి అడుగుపెట్టాడు. అమ్మాజీ లేచినిలబడింది.

"ఏమిటోయి పెద్ద ఉపన్యాసం యిస్తున్నావు" అంటూ వేళాకోళంగా అన్నాడు బావ.

"ప్రపంచమంటే ఎరుగని నీ వంటి పసివాళ్ళకు నా మాటలు ఒక ఉపన్యాసంలా కనబడతాయి. జీవిత లక్ష్యం సాధించినవారికి అవి అమృత తుల్యాలవుతాయి" అన్నా.

బావ పెద్దనవ్వు నవ్వుతూ "మంచి సంస్కారము, ప్రేమకు మిమ్మలను చెప్పే వేరేవాళ్లను తెప్పవలసి ఉంటుంది".

కొంచెము సేపటివరకు నిశ్శబ్దము. అక్క మెల్లగా "వచ్చావా" అంది బావతో.

మధురంగా పలికిన ప్రేమజీవి అక్క మాటలు అతనికి వినపడలేదు.

"బావా ఏదో అడుగుతోంది అక్క" అన్నా.

మాట్లాడకుండా పడుకోమనిచెప్పి వెళ్ళిపోయాడు బావ.

అమ్మాజీ దీర్ఘంగా ఆలోచిస్తోంది. నేను చెప్పినదంతా మళ్ళీ ఆలోచిస్తూ ఉంటుంది.

ఆ రాత్రి అక్కకు రోజుకంటే మరీ కంగారుగా ఉంది పరిస్థితి. నేను ఆమె పాదాలువద్దనే కునికిపాట్లుపడుతూ కూర్చున్నా. నా ఆరోగ్యంకూడా పాడవుతుందని పిన్నిభయం. అమ్మాజీ నిద్రపోతోంది.

"ఒక్కసారి అమ్మాజిని లేపు అంది" అక్క.

"ఎందుకు" అని ఎదురుగా ప్రశ్నించే సరికి అక్కకు కోపంవచ్చింది,

అమ్మాజీ, నేను, అక్కమంచము ప్రక్కగా కూర్చున్నాము. అమ్మాజీ అక్క తల నిమురుతోంది. నేను మంచము మీద ఒకచెయ్యి ఉంచి అమ్మాజీ వైపు చూస్తున్నా.

"మావయ్య, నా కొరకు, తన సౌఖ్యాన్నంతా వదులుకున్నాడు. అతనికి ఉద్యోగం నా మూలాన్నే పోయింది. ఎప్పుడూ నీ గురించే ఆలోచిస్తాడు. మావయ్యను కాదనకు తల్లీ. నేను బ్రతికుండగా మీరిద్దరు కలవడం చూడాలి అంటూ హస్తాన్ని నా చేతిలో ఉంచింది. ఇద్దరము అక్క వైపు తదేక దృష్టితో చూస్తున్నాము. దేవుడు ఆమెకు యింకా ఆయుర్దాయ్యం యిస్తే బాగుండును

♦ ♦ ♦

నా జీవితంలో మబ్బులు చెల్లాచదరయాయి. విశాలమైన నా స్మృతిపథంలో యీ నాటికి కొంచము కాంతి కనబడుతోంది. అమ్మాజీ యిప్పుడు పూర్తిగా మారింది. ఆమెలో పెరిగిన నవనాగరిక ఛాయలు మాటు మణిగాయి. ఆమె యిప్పుడు ఆదర్శ గృహిణీ. అభ్యుదయమార్గంలో విహరించే విహంగం అమ్మాజీ యిప్పుడు.